## కర్నూలు విజిలెన్స్ ఆర్‌వీఈఓగా చౌడేశ్వరి

**కర్నూలు, సెప్టెంబరు 4:** కర్నూలు జిల్లా విజిలెన్స్ ఆర్‌వీఈఓగా కె. చౌడేశ్వరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ప్రస్తుతం నాన్ కేడర్ ఎస్పీ హోదాలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నారు. ఈమెను కర్నూలుకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఆర్‌వీఈఓగా కొనసాగుతున్న కరీముల్లా షరీఫ్ తిరుపతిలో రెగ్యులర్ స్థానానికి వెళ్లారు.





# ఇసుక దోపిడీ...!

- సిండికేట్‌గా మారిన టిప్పర్ల యజమానులు
- 20 టన్నులు రూ.24 వేల పైమాటే..
- అమలులో అభాసుపాలవుతున్న 'ఉచితం'
- తెర వెనుక ఓ వైసీపీ ముఖ్య నేత హస్తం?

టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానానికి ఇసుక రవాణా టిప్పర్ల యజమానులు గండి కొడుకొతున్నారు. తమ స్వార్థానికి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నారు. టిప్పర్ల యజమానులు సిండికేట్‌గా మారి ఇష్టారాజ్యంగా ఇసుక ధరలు పెంచేశారు. 18-20 టన్నుల ఇసుక రూ.26 వేలకు పైగా విక్రయిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీ ప్రకారమైతే రూ.14-15 వేలకు మించకూడదు. ఇష్టారాజ్యంగా ధరలు పెంచేసి అమ్మకాలు చేస్తుండడం వల్ల భవన నిర్మాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిప్పరు యజమానులు కుమ్మక్కు కావడం వెనుక గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఓ వైసీపీ ముఖ్య నేత పాత్ర ఉందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. జిల్లా యంత్రాంగం ఉచిత ఇసుక పాలసీ పకడ్బందీ అమలుకు శ్రీకారం చుట్టినా కొందరి స్వార్థం కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు, కలెక్టరు పి. రంజిత్‌బాషా జోక్యం చేసుకొని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఇసుక భవన నిర్మాణదారులు, వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శింగవరం వద్ద ఇసుకను తోడి డంప్ చేస్తున్న దృశ్యం

**కర్నూలు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాల కోసం సి. బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె వద్ద నాలుగు డీసిల్టేషన్ రీచులు (నది నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు), కౌతాళం మండలం గుడికంబాలి, మరళి, నదిచాగి, నందవరం మండలం నాగులదిన్నె ఇసుక రీచ్‌లను ప్రభుత్వం గుర్తించింది. గత వైసీపీ ప్రభుత్వంలో 2021 మే నుంచి 2023 మే 15 వరకు జేపీ పవర్ వెంచర్ లిమిటెడ్ సంస్థ లీజుకు తీసుకొని ఇసుక అమ్మకాలు చేసింది. లీజు గడువు ముగిసినా ఇసుక అక్రమ తవ్వకాలు చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆ తరువాత ప్రతిమ సంస్థ లీజుకు తీసుకొని తవ్వకాలు సాగించింది. ఈ సంస్థలు రాజకీయ అండతో అక్రమ తవ్వకాలు సాగించారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. జగన్ ప్రభుత్వంలో ఇసుక బంగారంగా మారింది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం రాగానే ఉచిత ఇసుక అమలు చేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు స్పష్టమైన హామీ ఇచ్చారు. అందులో భాగంగానే టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఉచిత ఇసుక పాలసీ విధానానికి శ్రీకారం చుట్టారు. అయితే.. ధనాపేక్షతో ఇసుక రవాణా చేసే టిప్పరు యజమానులు ప్రభుత్వ లక్ష్యానికి గండి కొడుతున్నారు. రవాణా చార్జీల పేరుతో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్మకాలు చేస్తున్నారు.

**టిప్పరుపై రూ.8-10 వేలకు పైగా భారం**

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు తుంగభద్ర నది నుంచి ఇసుక సరఫరా చేయాల్సి ఉంది. పక్కా ప్రణాళికతో ఇసుక సరఫరాకు కలెక్టరు పి. రంజిత్ బాషా నేతృత్వంతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ శ్రీకారం చుట్టింది. తొలి విడతగా కొత్తకోట, కె. సింగవరం, ఈర్లదిన్నె డీసిల్టేషన్ రీచుల (నది నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) నుంచి ఈ నెల 29వ తేదీ నుంచి ఇసుక సరఫరాకు చర్యలు చేపట్టారు. కర్నూలు నగరం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న మైనింగ్ డీడీ కార్యాలయం, సి. బెళగల్ తహసీల్దారు కార్యాలయాల్లో బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. అక్కడ బుకింగ్ చేసుకున్న వారికే ఆయా రీచ్‌ల్లో ఇసుక లోడింగ్ చేస్తున్నారు. 11వ తేదీ నుంచి ఆన్‌లైన్ బుకింగ్ అమలు చేయనున్నారు. రాయల్టీ, నదిలో నుంచి బోటు ద్వారా ఇసుక ఒడ్డుకు చేర్చడం, టిప్పరుకు లోడింగ్ చేసినందుకు గాను టన్నుకు రూ.326 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో టన్నుకు రూ.625 వసూలు చేశారు. ప్రస్తుత విధానం వల్ల టన్నుకు రూ.300 చొప్పున 20 టన్నులకు రూ.6 వేల వరకు వినియోగదారుడికి ఆదా కావాలి. అయితే.. కర్నూలు నగరంలో 18-20 టన్నుల ఇసుక టిప్పరు రూ.24-26 వేల వరకు విక్రయిస్తున్నారు. ఆయా రీచ్‌ల నుంచి సుంకేసుల మీదుగా కర్నూలు నగరానికి ఇసుక చేర్చాలంటే 40-45 కి.మీ. మించి దూరం ఉండదు. ప్రభుత్వం నిర్ణయించిన ఇసుక రాయల్టీ, రవాణా చార్జీల ప్రకారం 18-20 టన్నుల టిప్పరు రూ.14-16 వేలకు మించదు. అంటే ఒక టిప్పరుపై రూ.8-10 వేలకు పైగా వసూలు చేస్తున్నారని భవన నిర్మాణదారులు (బిల్డర్లు) ఆందోళన చెందుతున్నారు.

### సిండికేట్ వెనుక వైసీపీ నేత హస్తం?:

తాజాగా టిప్పరు యజమానులందరూ ఒకే ధరకు ఇసుక అమ్మకాలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇసుక రవాణా టిప్పరు యజమానుల సిండికేట్ వెనుక గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలు, రవాణా లీజు తీసుకున్న జేపీ, ప్రతిమ సంస్థల నుంచి సబ్ కాంట్రాక్ట్ తీసుకొని ఇసుక రవాణా సాగించిన వైసీపీ ముఖ్యనేత ఒకరి హస్తం ఉందని సమాచారం. గత జగన్ ప్రభుత్వంలో ఇసుక టన్ను రూ.625 నిర్ణయించారు. ఈ లెక్కన 20 టన్నులకు రూ.12,500 చెల్లించాల్సి ఉండేది. రవాణా అదనంగా వసూలు చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమార్కులు ఒక్క టిప్పరు (20టన్నులు)కు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం డబ్బు చెల్లించి రసీదు తీసుకొని.. అదే రసీదుపై రెండు మూడు టిప్పర్లు ఇసుక అక్రమంగా తరలించేవారనే బలమైన ఆరోపణలు ఉన్నాయి. దీంతో 20 టన్నుల ఇసుక టిప్పరు రూ.16-18 వేలకు అమ్మేవారు. ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలు చేస్తున్నా నల్లబజారులో రూ.24-26 వేలకు విక్రయిస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్రను అడ్డుకోవాలని కోరుతున్నారు.



సి.బెళగల్ మండలం ఈర్లదిన్నెలో మరబోటు ద్వారా ఇసుకను బయటకు తీస్తున్న దృశ్యం



టిప్పరును ఇసుకతో నింపుతున్న ఎక్స్‌కవేటర్

జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిన రవాణా చార్జీల ప్రకారమైతే కర్నూలు నగరంలో ఇసుక ఈ ధరకే అమ్మాలి. సూమారుగా రూపాయల్లో..

| వాహనం/టన్నులు | రాయల్టీ/లోడింగ్ (టన్ను రూ.326) | 0-20 కి.మీలు రవాణా చార్జీ | 21-25 కి.మీ. అదనపు రవాణా | వినియోగదారుడికి అందించే రేటు |
|---|---|---|---|---|
| ట్రాక్టరు/4.5 | 1,467 | 1,400 | 900 | 3,767 |
| 6 టైర్ల లారీ/10 | 3,260 | 2.000 | 2,000 | 7,260 |
| 10 టైర్ల టిప్పరు/18 | 5,868 | 3,600 | 3,600 | 13,068 |
| 12 టైర్ల టిప్పరు/22 | 7,172 | 3,840 | 4,400 | 15,412 |
| 16 టైర్ల టిప్పరు/31 | 10,106 | 4,480 | 5,425 | 20,011 |



సి.బెళగల్ మండలం కె.శింగవరం వద్ద ఇసుకను తోడుతున్న ఎక్స్‌కవేటర్లు



## రైతులను వెంటాడుతున్న వాన

- పొలాల నిండా వర్షం నీరే
- కన్నీరు మున్నీరవుతున్న అన్నదాతలు



ఇటీవల కురిసిన వర్షాలకు కోడుమూరులో నేలమట్టమైన జొన్నపంట

**కర్నూలు (అగ్రికల్చర్), సెప్టెంబరు 4:** రైతులను వర్షం వెంటాడుతోంది. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు పంట పొలాలను ముంచేస్తున్నాయి. పంటలను ఎట్లా కాపాడుకోవాలో రైతులకు అర్థం కావడం లేదు. దాదాపు 3.80 లక్షల హెక్టార్లలో సాగు చేసిన పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, ఉల్లి, మిర్చి పొగాకు తదితర పంటలు ముంపు బారినపడ్డాయి. గత సంవత్సరం ఈ సమయానికి తీవ్ర వర్షాభావం వల్ల కళ్ల ముందే పంటలన్నీ ఎండిపోయాయని, ఈసారైనా పంటలు చేతికి వస్తాయని అనుకుంటే వర్షాలు పొలాలను ముంచేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళ, బుధవారం గూడూరు మండలంలో 38.8 ఎంఎం వర్షం నమోదైంది. కల్లూరులో 37.8, పెద్దకడుబూరులో 36.4, ఎమ్మిగనూరులో 32.4, కౌతాళంలో 26.2, సీ. బెళగల్‌లో 23.8, గోనెగండ్ల 20.6, ఆదోని 18.2, కర్నూలు అర్బన్ 16.8, నందవరం 16.8, వెల్దుర్తి 15.6, కర్నూలు రూరల్ 15.4, కోసిగి 12.4, మంత్రాలయం 10.2, కోడుమూరు 6.6, ఓర్వకల్లు 6.2, దేవనకొండ 6 ఎంఎం, పత్తికొండ 5 ఎంఎం, మిగిలిన మండలాల్లో 2 నుంచి 3 ఎంఎం వర్షం నమోదైంది. సెప్టెంబరు 116.5 ఎంఎం వర్షం నమోదు కావాల్సి ఉండగా.. బుధవారం నాటికి 31 ఎంఎం వర్షం నమోదైంది. మరో 15 నుంచి 20 రోజుల పాటు వర్షం కురవకపోతే పంటలు రైతుల చేతికి అందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

## ఆర్డీఎస్ ఆనకట్టపై పోటెత్తిన వరద

- టీబీ డ్యాం నుంచి 50 వేల క్యూసెక్కుల నీరు



ఫోటో: కోసిగి-01

ఆర్డీఎస్ ఆనకట్టపై దిగువకు పారుతున్న వరద నీరు

**కోసిగి, సెప్టెంబరు 4:** తుంగభద్ర డ్యాం నుంచి 50వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో బుధవారం మధ్యాహ్నం కోసిగి మండలంలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీం) కట్టకు వరదనీరు పోటెత్తింది. దీనికి తోడు గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షం నీరు ఆనకట్టకు పోటెత్తడంతో భారీగా వరదనీరు ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి దిగువకు పారుతోంది. ఆర్డీఎస్ ఆనకట్ట వరద ప్రవాహాన్ని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు. నదితీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నిత్యానంద రాజు, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ ప్రజలకు తెలియజేశారు.

## స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయండి

- మొదట ప్రయోగాత్మకంగా ప్రభుత్వ సర్వీసులకు
- విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి

**కల్లూరు, సెప్టెంబరు 4:** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం. ఉమాపతి బుధవారం అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రయోగాత్మకంగా ప్రీ పెయిడ్ మీటర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వీసులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఈ తెలిపారు. విద్యుత్ వినియోగం, రిమోట్ రీడింగ్, బిల్లింగ్ తదితర విషయాల్లో వాటి పనితీరును పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తామన్నారు.

**కర్నూలులో మొదటి స్మార్ట్ మీటర్ ఏర్పాటు**

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కేంద్రంలో మొట్టమొదటి స్మార్ట్ మీటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి సంతోష్‌నగర్ సెక్షన్ పరిధిలోని లేబర్‌కాలనీ ఉర్దూ పాఠశాలలో సింగిల్ ఫేస్ స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం తొమ్మిది ప్రభుత్వ సర్వీస్‌లకు స్మార్ట్ మీటర్లు అమర్చినట్లు ఈఈ టి.శేషాద్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ ఈఈ రాజేష్, ఏడీఈ నాగప్రసాద్, ఏఈ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని లేబర్ కాలనీ ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం
- కలెక్టర్ పి.రంజిత్ బాషా

**తుగ్గలి, సెప్టెంబరు 4:** అన్నదాతలు ఎవరూ అధైర్యపడవద్దని, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. మండల పరిధిలోని పగిడిరాయిలో భారీ వర్షాలకు నీట మునిగిన పంటలను బుధవారం పరిశీలించారు. అనంతరం నష్టపోయిన రైతులతో మాట్లాడారు. రైతులు నీట మునిగిన కంది, ఆముదం, వేరుశనగ తదితర పంటలను తీసుకువచ్చి కలెక్టర్‌కు చూపించారు. భారీ వర్షాల వల్ల పంటలు నీట మునిగి కుళ్లిపోయాని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ పంట నష్టంపై నివేదికలు తయారు చేసి పంపాలని వ్యవసాయాధికారులకు సూచించారు. అలాగే పగిడిరాయిలో వర్షాలకు కూలిపోయిన ఇంటి యజమానులకు రూ.4 వేల చొప్పున నగదును అందించారు. త్వరలోనే నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, ఆర్డీవో రామలక్ష్మి, ఏడీఏ మోహన్ క్రిష్ణ, ఏవో పవన్ కుమార్, తహసీల్దార్ నాగరాజు ఉన్నారు.



నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

## వరద బాధితులకు కిట్లు : టీడీపీ

**కర్నూలు (అర్బన్), సెప్టెంబరు 4:** విజయవాడ ప్రాంతంలో వరద బాధితులకు నిత్యావసర కిట్లు అందజేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావుయాదవ్, ముంతాజ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్ల తయారీ గురించి జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులతో కలిసి ఓ సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు సోమిశెట్టి నవీన్, హనుమంతరావు చౌదరి, సత్రం రామక్రిష్ణుడు, పోతురాజు రవికుమార్, బేతం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు, నాయకులు

## సూర్య ఘర్ యోజనకు చర్యలు తీసుకోండి


● కలెక్టర్ పి. రంజిత్‌బాషా



సోలార్ రూప్ టాప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4:** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబరులో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో భాగంగా సోలార్ రూప్‌టాప్ ఏర్పాటుకు సంబంధించి పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఈ పథకం అమలుపై సంబంధిత శాఖ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు ఇళ్ల పైకప్పుపై సోలార్ రూప్ టాప్‌లను ఏర్పాటు చేసుకోవడానికి వంద చదరపు అడుగుల స్థలం అవసరం అవుతుందన్నారు. ఈ యూనిట్ ద్వారా నెలకు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఇందు కోసం రూ.60 నుంచి 70వేలు ఖర్చు అవుతుందని అన్నారు. ఇందులో సెంట్రల్ ఫైనాన్స్ అసిస్టెన్స్ కింద రూ.30వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న www.pmsuryaghar.gov.in/APSPDCL వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ అధికారి వీరేంద్రబాబు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఉమాపతి, మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఎల్డీఎం రామచంద్రరావు, డీపీవో నాగరాజునాయుడు పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎస్వీ మోహన్ రెడ్డి



**కర్నూలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు జిల్లా వైసీపీ అధ్యక్షుడుగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ముందు వరకు వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా నగర మేయర్ బీవై రామయ్య కొనసాగారు. ఆయన కర్నూలు పార్లమెంటు స్థానానికి వైసీపీ అభ్యర్థిగా దిగడంతో ఆ స్థానంలో కార్పొరేటర్ నారాయణమ్మను నియమించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్వీ మోహన్ రెడ్డిని అధిష్ఠానం ఎంపిక చేసింది. 2014లో కర్నూలు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎస్వీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఆశించారు. అధిష్ఠానం నిరాకరించడంతో మళ్లీ వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్ రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారన్నారు. ఆయన నమ్మకాన్ని నిలబెడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వివరించారు.

## సబ్సిడీ వాహనాలకు దరఖాస్తులు

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4:** జిల్లాలో సబ్సిడీపై దివ్యాంగులకు అందించే మూడు చక్రాల మోటారు వాహనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఫాతిమా తెలిపారు. అర్హులైన వారు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, ఆధార్‌కార్డు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ వాహనం రిజిస్ట్రేషన్ తదితర పత్రాలను జత పరచాలని తెలిపారు. దరఖాస్తులను కర్నూలు నగరంలోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 08518-277864 నెంబరును సంప్రదించాలని ఆమె సూచించారు.

## రేపు ఉద్యోగులకు కౌన్సెలింగ్

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4:** రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు అనుమతించడంతో జిల్లాలోని ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గ్రేడ్-2 వీఆర్వోలకు భూసర్వే సంబంధించిన ఉద్యోగులకు భూసర్వే కార్యాలయంలో అభ్యర్థులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 వీఆర్వోలు దాదాపు 150 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా భూసర్వే శాఖ ఉద్యోగులు 290 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

## అగ్గిపెట్టె ఇవ్వలేదని..

● మద్యం మత్తులో బండరాయితో దాడి

**నంద్యాల క్రైం, సెప్టెంబరు 4 :** సిగరెట్ కాల్చేందుకు అగ్గిపెట్టె ఇవ్వలేదని మద్యం మత్తులో తల పగులగొట్టిన ఘటన నంద్యాలలో జరిగింది. ఎన్‌జీవోస్ కాలనీలోని ఓ బహిరంగ ప్రాంతంలో మద్యం సేవించిన గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపైకి వచ్చాడు. ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతుండగా అతడి వద్దకు వెళ్లి అగ్గిపెట్టె అడిగాడు. తన దగ్గర అగ్గిపెట్టె లేదని చెప్పడంతో పక్కనే ఉన్న రాయితో మనోహర్‌రెడ్డి తలపై దాడి చేసి పరారయ్యాడు. స్థానికులు మనోహర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

## గంజాయి సరఫరా కేసులో నలుగురి అరెస్టు

**నంద్యాల క్రైం, సెప్టెంబరు 4 :** గంజాయిని అక్రమంగా సరఫరా చేసే నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ యుగంధర్‌బాబు బుధవారం తెలిపారు. నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన నలుగురు వ్యక్తులు పలుమార్లు అరకు నుంచి గంజాయి కొనుగోలు చేసి నంద్యాలకు తీసుకువచ్చి వారి అవసరం మేరకు అధిక ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని డీఎస్పీ తెలిపారు. అందిన సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది మంగళవారం నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న 2.25కేజీల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు.

## ఐదుగురికి రిమాండ్

**నంద్యాల క్రైం, సెప్టెంబరు 4 :** గంజాయిని అక్రమంగా సరఫరా చేసే ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి బుధవారం తెలిపారు. నంద్యాల త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న దర్గా వద్ద ఐదుగురు గంజాయిని విక్రయిస్తుండటంతో అరెస్టు చేశామన్నారు. అరకు నుంచి గంజాయి కొనుగోలు చేసి నంద్యాలకు తీసుకువచ్చి వారి అవసరం మేర అధిక ధరకు అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారని సీఐ తెలిపారు. అందిన సమాచారం మేరకు వారివద్ద ఉన్న 4 కేజీల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

# వర్సిటీల రూపురేఖలు మారేనా..?



● ఈసీల స్థానంలో బోర్డు ఆఫ్ చైర్మన్లు..!
● అక్రమాలకు చెక్ పెట్టేందుకు వ్యూహం
● వర్సిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 4:**

**కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వర్సిటీలను దారిలో పెట్టడానికి కసరత్తు జరుగుతోంది. ఈ క్రమంలో పాలక మండలి (ఈసీ) సభ్యులను రద్దు చేసి వాటి స్థానంలో బోర్డు ఆఫ్ చైర్మన్లను నియమించడానికి చర్యలు తీసుకోనున్నారని సమాచారం. వర్సిటీలను అభివృద్ధి వైపు తీసుకెళ్లి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది ఈ క్రమంలో ఇటీవల రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో ఉప కులపతులు, రిజిస్ట్రార్‌లు మారారు. కానీ పాలక మండళ్లు లేక పోవడంతో అభివృద్ధి, పనులు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని విద్యార్థి సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి.**

### ఈసీలు లేక పేరుకుపోతున్న ఫైళ్లు...?

రాయలసీమ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల్లో పెండింగ్ ఫైళ్లు పేరుకపోతున్నాయి. అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్ అంశాల్లోని కీలకమైన పనులన్నీ నిలిచిపోయాయి. ఉద్యోగుల పదోన్నతులు, జీతభత్యాలు వంటి ప్రక్రియలు మాత్రమే యథావిధిగా కొనసాగుతున్నాయి. పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలంటే పాలక మండలి (ఈసీ) ఆమోదం పొందాలి. అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్, పదోన్నతుల వంటి అంశాలకు ఈసీ పర్మిషన్ తీసుకోవాలి. నూతన ఈసీని ఏర్పాటు చేయకపోవడంతో పనులన్నీ పెండింగ్‌లో పడ్డాయని వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కీలక పదవుల్లో కొనసాగుతున్న వారిని, పాలక మండలి సభ్యులను భయభ్రాంతులకు గురి చేసి వారిని విధుల నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు మూడు నెలలు అవుతున్నా వైసీపీ ప్రభుత్వం నియమించిన వారే పాలక మండలిలో కొనసాగుతున్నారు. దీంతో కీలక అంశాలు పెండింగ్‌లో పడ్డాయి.

### ఇప్పటి వరకు నడిచింది ఇలా..

ఈసీ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. వర్సిటీల్లో డీన్, డైరెక్టర్, కోఆర్డినేటర్. ప్రిన్సిపాల్స్, హెచ్‌వోడీ, వార్డెన్, మేనేజర్ తదితర పదవులను వీసీ నియమిస్తారు. వీసీల ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేస్తారు. వాటిని ఆమోదించేందుకు ఈసీ సమావేశం నిర్వహించాలి. రాయలసీమ యూనివర్సిటీల్లో ఏ విభాగంలో మార్పులు చేయలేదు.. పూర్తి స్థాయిలో మార్పులు, చేర్పులు చేయాలన్నా.. కొత్త ఆలోచనలు అమలు చేయాలన్నా ఈసీని నియమించాలి. వీటన్నింటికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల కోసం జిల్లాలోని మూడు వర్సిటీల అధికారులు, ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

### ఆశావహుల ఎదురు చూపు..

ఉన్నత విద్యనందించే వర్సిటీల్లో పారదర్శకమైన నిర్ణయాలు, వాటి అమలుతో విద్యార్థుల భవిష్యత్, ఉద్యోగుల సంక్షేమం ఆధాపడి ఉంటుంది. ఇలాంటి పదవుల్లో అనుభవం ఉన్న కీలక అధికారులను నిర్ణేతలుగా నియమించాల్సిన చోట అనర్హులకు అందలమెక్కించారు. పరీక్షల నిర్వహణ. జవాబు పత్రాల మూల్యాంకనం, ఉద్యోగుల బదిలీలు, ఉద్యోగోన్నతులు, ఇలా అనేక అంశాల్లో ఇష్టానుసారంగా వ్యవహరించారు. దీంతో గత ఐదేళ్ల వర్సిటీల ఖ్యాతి మసకబారిపోయిందనే విమర్శలు ఉన్నాయి.

### ఈసీల స్థానంలో బోర్డు ఆఫ్ చైర్మన్లు..?

రాష్ట్రంలోని వర్సిటీల్లో పాలక మండళ్ల(ఈసీ) స్థానంలో బోర్డు ఆఫ్ చైర్మన్లను నియమిస్తారనే ప్రచారం ఉంది. ఈ కొత్త తరహా విధానాన్ని అమలు చేసి అక్రమాలకు చెక్ పెట్టాలనే ఆలోచనలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ముగ్గురు సభ్యులతో కూడిన ఒక కమిటీ వేసి నివేదిక తెప్పించుకున్నట్లు వర్సిటీలోని ఉపకులపతులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న పాలక మండళ్ల వ్యవస్థకు స్వస్తి పలుకుతూ బోర్డు ఆఫ్ చైర్మన్స్‌ను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఈ చైర్మన్లను కూడా రాష్ట్ర స్థాయిలో ఉండే ఉన్నత విద్యావంతులు, పారిశ్రామికవేత్తలు, కంపెనీల డైరెక్టర్లను ఇందులో సభ్యులుగా చేర్చితే అక్రమాలకు చెక్ పడటమే కాక వర్సిటీలను అభివృద్ధి చేయవచ్చనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే పాలక మండళ్ల నియామకంలో జాప్యం జరుగుతోందని వర్సిటీల్లోని కొందరు ఉపకులపతులు చెబుతున్నారు.

# రిజర్వాయర్లను నింపండి

● జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
● ముగిసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు



మాట్లాడుతున్న చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 4:** ఉమ్మడి జిల్లాలో వర్షాలు విపరీతంగా కురుస్తుండటంతో జల వనరుల శాఖ అధికారులు అన్ని రిజర్వాయర్లను నింపే విధంగా చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ మినీ సమా వేశం భవనంలో జరిగిన ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరిగా యి. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈఓ జి. నాసరరెడ్డి పర్యవేక్షించా రు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వాతావరణం అనుకూలంగా ఉంది. వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, ఇన్ని రోజులు రిజర్వాయర్లను నింపుకోకుండా ఏం చేస్తున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు, మండల కేంద్రం, గ్రామాల్లోని ఆసుపత్రులను తనిఖీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామంలో నిర్మిస్తున్న పవర్‌గ్రిడ్‌లో పని చేస్తున్న చైన్ ఎక్స్‌కవేటర్లను పన్నుల చెల్లించాలని, ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. తక్షణమే వాటిని విడిచిపెట్టాలని ఆదేశించారు. నూతనంగా అమలులోకి వచ్చిన డ్రైవింగ్ లైసెన్సుపై అవగాహన నిర్వహిం చాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీలు అడిగిన ప్రశ్నలకు అధికారులు లిఖిత పూర్వకంగా సమాధానాలు చెప్పాలని ఆదేశించారు. నాడు-నేడు కింద ప్రారంభమైన పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రాల్లోని ఆర్టీసీ బస్టాండులను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్, ఎస్సీ వెల్ఫేర్ నుంచి వచ్చిన నిధులను పంచాయతీరాజ్ విభాగం అధికారులు సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇప్పటికే ఆలస్యమైందని, ఈ నెలాఖరుకు నిధులను ఖర్చు పెట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలో రూ.30 అదనంగా ఎరువులను విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో మత్స్యకారులకు కొత్తగా లైసెన్సులు ఇవ్వడంతోపాటు ఉన్న వారికి రెన్యువల్ చేయాలని కోరారు. గోరుకల్లు నుంచి డోన్ నియోజవర్గానికి నీళ్లు తీసుకెళ్లి తమ నియోజకవర్గానికి తాగు నీరు లేకుండా చేశారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. అధికారులు పునరాలోచించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. ఇంకా పలువురు సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీలు దివ్య, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, పోచా జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనసూయమ్మ పాల్గొన్నారు.

## బ్రాహ్మణదొడ్డి నుంచి పోలకల్లుకు రాకపోకలు బంద్



వర్షానికి కొట్టుకు పోయిన బ్రాహ్మణదొడ్డి రోడ్డు

**సి. బెళగల్, సెప్టెంబరు 4:** మండలంలోని పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి గ్రామాలలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి బ్రాహ్మణదొడ్డికి- పోలకల్లుకు మధ్య ఉన్న రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు బందయ్యాయి. దీని వల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలకల్లు గ్రామ రైతుల పొలాలు బ్రాహ్మణదొడ్డి పొలిమేరలో ఉన్నాయి. ఈ దారెంట ఎద్దుబండ్లు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఈ మార్గంలో రోడ్డు వేయాలని రెండు గ్రామాల రైతులు కోరుతున్నారు.

## మామపై అల్లుడి దాడి

**సి. బెళగల్, సెప్టెంబరు 4:** మండల కేంద్రానికి చెందిన వేణు తెలంగాణ రాష్ట్రం వడ్డెపల్లి మండలం వెంకటాపురం నుంచి వచ్చిన మామ శ్రీనివాసులుపై ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. సి బెళగల్‌లో చనిపోయిన బంధువు అంత్యక్రియలకు కుటుంబ సభ్యులతో శ్రీనివాసులు వచ్చాడు. ఈ సందర్భంగా వేణు ఆగ్రహంతో ఇనుప రాడ్డు తీసుకొని మామ తలపై కొట్టాడు. బంధువులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో శ్రీనివాసులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

## తండ్రి మందలించాడని..

## ఇల్లు వదిలి వెళ్లిపోయిన ఇంటర్ విద్యార్థి

**గోనెగండ్ల, సెప్టెంబరు 4:** అల్లరిగా తిరగవద్దని, పరీక్షలు దగ్గర పడుతున్నాయని తండ్రి మందలించినందుకు అలిగి అనిల్ కుమార్ అనే విద్యార్థి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. పూజరి వెంకటేశ్వర్లు గోనెగండ్లలో రేషన్ డీలర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన రెండో కుమారుడు అనిల్‌కుమార్ ఎమ్మిగనూరులోని వైష్ణవి కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం వెంకటేశ్వర్లు తన కుమారుడిని అల్లరిగా తిరగవద్దని మందలించాడు. దీంతో అనిల్‌కుమార్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మంగళవారం దాకా తిరిగి రాకపోవడంతో బుధవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో పూజారి వెంకటేశ్వర్లు, తల్లి పద్మావతి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

● జిల్లాలో 23 మంది ఎంపిక ● నేడు కలెక్టరేట్‌లో అవార్డుల ప్రదానోత్సవం

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4:** కర్నూలు జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా 23 మంది ఎంపికయ్యారు. ఉపాధ్యాయ అవార్డుకు జిల్లా వ్యాప్తంగా 32 మంది ఉపాధ్యాయులు 15 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారి నుంచి దరఖాస్తులు వచ్చాయి. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఆధ్వర్యంలో ఈ దరఖాస్తులను పరిశీలించి విద్యార్థులకు ఉత్తమ సర్వీసు ఇచ్చిన 23 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. అవార్డుకు ఎంపికైన వారిని గురువారం ఉదయం 10 గంటలకు కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ పి. రంజిత్ బాషా సన్మానిస్తారని డీఈవో శామ్యూల్ తెలిపారు. అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు డీఈవో తెలిపారు.

**ఉత్తమ ఉపాధ్యాయుల వివరాలు**

| పేరు | సబ్జెక్టు | పాఠశాల పేరు | మండలం |
|---|---|---|---|
| నరసింహారెడ్డి | ఎస్‌ఏ (బీఎస్) | జడ్పీహెచ్‌ఎస్, ఆర్‌జీనగర్ ఆదోని | |
| వెంకటసుబ్బయ్య | ఎస్‌ఏ (పీఎస్) | జడ్పీహెచ్‌ఎస్, దొండనగేరి | ఆదోని |
| ఎస్. వెంకోబ | పీఎస్ హెచ్‌ఎం | ఎంపీపీఎస్, విరుపాపురం | ఆదోని |
| ఎన్. రాజు సతీష్ | ఎస్‌ఏ (పీఎస్) | మున్సిపల్ హెచ్‌ఎస్, 2వ వార్డు | ఆదోని |
| నరసింహులు | టీజీటీ (తెలుగు) | డా. అంబేడ్కర్ గురుకుల | ఆరేకల్ |
| టి. శ్రీనివాసులు | పీఎస్ హెచ్‌ఎం | ఎంపీపీఎస్, మొలగవెల్లి | ఆలూరు |
| మంజులమ్మ | ఎస్‌జీటీ | ఎంపీపీఎస్, మెయిన్ | ఆలూరు |
| మారంబీ | ఎస్‌ఏ (హిందీ) | జడ్పీహెచ్‌ఎస్ | ఆస్పరి |
| పట్టె ఎల్లప్ప | పీఎస్‌హెచ్‌ఎం | ఎంపీపీఎస్ (బీసీ) | ఆస్పరి |
| కేఎం బీసమ్మ | ఎస్‌ఏ (సోషల్-కెనడ) | జడ్పీహెచ్‌ఎస్ గూళ్యం | హాలహర్వి |
| ఏఎం సుధాశేఖర్ | పీఎస్‌హెచ్‌ఎం | ఎంపీపీఎస్ సిద్ధాపురం | హాలహర్వి |
| సిద్ధలింగ | పీఎస్‌హెచ్‌ఎం | ఎంపీపీఎస్ హోసనహల్లి | హాలహర్వి |
| సయ్యద్ అఫ్జారున్నీసా | ఎస్‌ఏ (బీఎస్) | జడ్పీహెచ్‌ఎస్, హెబ్బటం | హాలహర్వి |
| శ్రీనివాసరెడ్డి | ఎస్‌ఏ(బీఎస్) | జడ్పీహెచ్‌ఎస్, ముజఫర్‌నగర్ | కల్లూరు |
| పుష్పావతమ్మ | పీఎస్‌హెచ్‌ఎం | ఎంపీపీఎస్, నిర్మల్‌నగర్ | కల్లూరు |
| పి. ఈశ్వరప్ప | ఎస్‌ఏ(బీఎస్) | జడ్పీహెచ్‌ఎస్, కందుకూరు | కోసిగి |
| మహ్మద్ రఫిక్ | ఎస్‌ఏ (ఇంగ్లీష్) | జడ్పీహెచ్‌ఎష్, మునగాలపాడు | కర్నూలు |
| కిరణ్ కుమార్ | పీఎస్‌హెచ్‌ఎం | ఎంపీపీఎస్, ఆర్‌కే దుద్యాల | కర్నూలు |
| ఎ. వేణుగోపాల్ | ఎస్‌ఏ (తెలుగు) | జడ్పీహెచ్‌ఎస్, తుంగభద్ర | మంత్రాలయం |
| నాగేశ్వరయ్య | ఎస్‌జీటీ | జీపీ తండా | ఓర్వకల్లు |
| వి. విక్టోరియం | పీహెచ్‌ఎస్‌ఎం | ఎంపీపీఎస్ | పెద్దకడుబూరు |
| కే. విజయకుమారి | ఎస్‌ఏ (మ్యాథ్స్) | జడ్పీహెచ్‌ఎస్ హనుమాపురం | పెద్దకడుబూరు |
| జి. వెంకటరమణ | ఎస్‌ఏ (హిందీ) | జడ్పీహెచ్‌ఎస్, దైవందిన్నె | ఎమ్మిగనూరు |

## వ్యక్తి ఆత్మహత్య

**అవుకు, సెప్టెంబరు 4 :** అవుకు మండలం సంగపట్నం గ్రామానికి చెందిన చాకలి చిన్న అంకాలు (31) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రాజారెడ్డి వివరాల మేరకు.. చిన్న అంకాలు మద్యానికి బానిసై భార్య లక్ష్మీతో గొడవ పడే వాడు. మద్యం తాగటానికి భార్య డబ్బులు ఇవ్వలేదని తెల్లవారు జామున పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**ఉయ్యాలవాడ, సెప్టెంబరు 4:** మండలం లోని మాయలూరు గ్రామానికి చెందిన ఎడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి బుధవారం తెలిపారు. గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావటంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.4,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**గూడూరు, సెప్టెంబరు 4:** గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. బుధవారం గూడూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సీఐ తబ్రేజ్, ఎస్ఐ తిమ్మయ్య, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస నాయక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలన్నారు.

## ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు: సీఐ


మాట్లాడుతున్న సీఐ చంద్రబాబు నాయుడు

**కర్నూలు, సెప్టెంబరు 4:** కర్నూలు రూరల్ సర్కిల్ పరిధిలో ఓర్వకల్లు, ఉలిందకొండ, నాగులాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేశ్ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో 250 దాకా, ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధి లో 140, నాగులాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 80 విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు ఇస్తున్నామన్నారు. కల్లూరు, ఓర్వకల్లు, నాగులాపురం, ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు రోజు లకే నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి

### రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ దాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీజీ వెంకటేశ్, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత

**కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 4:** ఆధునిక కాలంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా నూతన సాంకేతిక విధానాలను అనుసరిస్తూ ఫొటో, వీడియోగ్రాఫర్లు తమ వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం నగర శివారు పెద్దపాడు రోడ్డులోని రాజ్ ఫంక్షన్ హాలులో జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్, డిజైనర్స్, ఎడిటర్స్ అలైడ్ సర్వీసెస్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. ముందుగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ దేశంలో వృత్తులను బట్టి కులాలు ఏర్పడ్డాయని, అయితే కులాలకు అతీతంగా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వృత్తులు వచ్చాయని చెప్పారు. ఛాయా చిత్రాలకు పూర్వం చిత్రలేఖనం ఉండేదని, ఆ తర్వాత ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీలు వచ్చాయని, ఆధునిక పరిజ్ఞానంతో ఈ రంగం రోజురోజుకూ విస్తరిస్తోందని తెలిపారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఫొటో, వీడియోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. అనంతరం ఫొటోగ్రాఫర్లు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించి వారిని అభినందించారు.

## 'గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి'


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో, హౌసింగ్ పీడీ

**గూడూరు సెప్టెంబరు 4:** గృహ నిర్మాణాలను వేగవంతం చేయా లని కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి లబ్ధిదారులకు సూచించారు. బుధవారం గూడూరులో పర్యటించిన ఆర్డీవో, పీడీలు ప్రభుత్వ లేవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి నాటికి గృహాలన్నింటిని పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం వెలుగు కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా గృహాలు ఎన్ని మంజూరయ్యాయి, ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి. ఇంకా నిర్మాణాలు జరగాల్సినవి ఎన్ని అనేదానిపై సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో విజయసింహారెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ రవికుమార్, హౌసింగ్ ఏఈ జమ్మన్న, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

# రేషన్ షాపుల్లో 14 రకాల సరుకులు ఇవ్వాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

**కర్నూలు(రూరల్), సెప్టెంబరు 4:** చౌక దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పేదలకు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. జగన్నాథం డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు మూడో రోజు కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆ పార్టీ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జగన్నాథం హాజరై ప్రసంగించారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శిం చారు. కర్నూలు నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి పేదలపై ఏ మాత్రం గౌరవం ఉన్నా.. 14రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, నాగరాజు, భీసన్న, గిడ్డమ్మ, నీలకంఠప్ప తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో మత స్వేచ్ఛకు ప్రాధాన్యం: టీజీ

**కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 4:** భారతదేశంలో మత స్వేచ్ఛకు బీజేపీ ప్రాధాన్యం ఇస్తోందని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక పరిణయ సమావేశ భవనంలో పార్టీ సభ్యత్వ నమోదుపై సంబంధిత బాధ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో పరమత స్వేచ్ఛ పట్ల అణచివేత ధోరణి ఉందని అన్నారు. అటువంటి వైఖరి ఇక్కడ లేదని గుర్తు చేశారు. అన్ని మతాలు సమానమేనని, ఎవరి విశ్వాసాలు వారివే అన్నట్లు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. వరదల సమయంలో సీఎం చంద్రబాబు స్పందన ప్రశంసనీయమన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, రామస్వామి, వినూషరెడ్డి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



## మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం

**ఓర్వకల్లు, సెప్టెంబరు 4:** వినాయక విగ్రహాల మండపాల ఏర్పాటుకు ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని ప్రవేశపె ట్టిందని ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం ఓర్వకల్లులోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ గణేశ్ మండపాలు ఏర్పాటు చేస్తే కమిటీ సభ్యుల వివరాలు, మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది.. నిమజ్జనం వంటి వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఎస్‌వోకు వెళ్తుందన్నారు. అధికారులు పరిశీలించి అనుమతులకు అవసరమైన రుసుం వివరాలు తెలియజేస్తారని వివరించారు. మీసేవా కేంద్రాల్లో రుసుం చెల్లించిన అనంతరం ఎన్ వోసీ జారీ చేస్తారని, ఆ పత్రాన్ని ప్రింట్ తీసి గణేశ్ మండపాల్లో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 4:** నగరంలోని ఒకటో డివిజన్ పరిధిలో కండేరి, సాయి బాబా, కొత్తపేటలో పారిశుధ్య పనులను నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల నేపథ్యంలో తాగు నీరు కలుషితం కాకుండా చూడాలని, రహదారులు పరిశుభ్రంగా ఉంచాలని, మురుగు కాలువల్లో చెత్తాచె దారాన్ని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. వరద బాధితుల సాయం కోసం ప్రజారోగ్య విభాగం నుంచి వంద మంది కార్మికులు, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 16 మంది కార్యదర్శులను విజయవాడకు పంపించామన్నారు. కమిషనర్ వెంట మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్ వైజర్ నాగరాజు, ఇన్‌స్పెక్టర్ లోకేష్ ఉన్నారు.

## అధికారుల సలహాలు పాటించాలి


రైతులకు లింగాకర్షణ బుట్టలు అందజేస్తున్న అధికారులు

**సి.బెళగల్, సెప్టెంబరు 4:** రైతులు వ్యవసాయాధికారుల సలహాలను తప్పక పాటించాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత సూచించారు. బుధవారం మండలంలోని బురాన్‌దొడ్డి రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ ఆధ్వర్యంలో లింగా కర్షణ బుట్టల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం బురాన్‌దొడ్డి గ్రామంలో వెంకటలక్ష్మమ్మ సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ప్రతి రైతు పంట మార్పిడి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. బురాన్‌దొడ్డి గ్రామంలో పత్తి సాగు చేస్తున్న రైతులకు ఆమె లింగాకర్షణ బుట్టలను అందజేశారు. ఈసమావేశంలో శాస్త్రవేత్తలు గిరీష్, వెంకటేశ్వర్లు, దస్తగిరి, శశిధర్‌రెడ్డి, ఏవోలు మల్లేష్ కుమార్, మధులత, ఎంపీఈవో వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## వీఆర్వోలపై తహసీల్దార్ ఆగ్రహం

**సి.బెళగల్, సెప్టెంబరు 4:** రైతుల దరఖాస్తులపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని తహసీల్దార్ విజయశ్రీ వీఆర్వోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె వీఆర్వోలతో సమావేశమయ్యారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి రైతుల నుంచి వస్తున్న దరఖాస్తులపై ఎందుకు జాప్యం వహిస్తున్నారని తహసీల్దార్ కంబంధహల్, బురాన్‌దొడ్డి, కొండాపురం గ్రామాల వీఆర్వోలపై మండిపడ్డారు. ఈసమావేశంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

## నేడు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 4:** నగరంలోని వాసవీ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు ఆ సంస్థ అధినేత విశ్వనాథం శేషఫణి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

## పోలీసుల అదుపులో వడ్ల వ్యాపారి

**కర్నూలు, సెప్టెంబరు 4:** రైతుల నుంచి వరి ధాన్యం సేకరించి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన కేసులో రైస్‌మిల్ యజమాని దుర్గాప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మామిదాలపాడు సమీపంలో దుర్గాప్రసాద్ రైస్‌మిల్‌ను నిర్వహిస్తున్నాడు. ఇటీవల కొంత మంది రైతులు, వ్యాపారుల నుంచి వరిధాన్యం సేకరించినా తిరిగి వారికి డబ్బు చెల్లించలేదు. దీంతో కొంతమంది మహిళలు డబ్బులు ఇవ్వాలని అడగా.. వారిని బెదిరించడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## మహావీర్ నగర్‌లో చోరీ

**కర్నూలు, సెప్టెంబరు 4:** నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహావీర్ నగర్‌లో చోరీ జరిగింది. శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో సుమారు 15 తులాల బంగారు నగలు అపహరించారు. శ్రీనివాసరెడ్డి గత నెల 25న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదు వెళ్లాడు. 27న తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానంతో వెళ్లి చూశాడు. ఇంట్లో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

**బైక్ చోరీ:** నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షరీన్ నగర్‌కు చెందిన లతీఫ్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది. లతీఫ్ తన బైక్‌ను ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఉంచి లోపలికి వెళ్లి తిరిగి వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. పలుచోట్ల వెతికినా బైక్ కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఆలస్యంగా కేసు నమోదు చేశారు.

# 'విమానాశ్రయ విస్తరణకు సహకరించండి'


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

**ఓర్వకల్లు, సెప్టెంబరు 4:** ఓర్వకల్లు సమీపంలో విమానాల ల్యాండింగ్, ఎయిర్‌పోర్టు విస్తరణకు రైతులు సహకరించాలని తహసీల్దార్ వెంకటరమణ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓర్వకల్లు పొలిమేరలోని 551, 557, 539, 606, 701 సర్వే నెంబర్లలోని రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు, అడంగల్, ఆర్ఎస్ఆర్, ఆర్‌వోఆర్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ ఓర్వకల్లు పొలిమేరలో 36 ఎకరాల 48 సెంట్ల భూమిని విమానాశ్రయం విస్తరణకు సేకరించామన్నారు. ఇందులో 36 ఎకరాల 48 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందని, అందులో మూడెకరాల 32 సెంట్లు పట్టాభూమి ఉందని తెలిపారు. ఆ భూములను సర్వే చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్, సర్వేయర్ జయరాముడు, వీఆర్వో కృష్ణదేవరాయలు, పూడిచెర్ల రైతులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 4:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 127 సచివాలయంలో వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు మల్లేశ్వరి, కళ్యాణి, శిరీష, భువన పాల్గొన్నారు.

## కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా చక్రపాణి

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 4:** నగర పాలక సంస్థ అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ అధికారిగా చక్రపాణిని నియమిస్తూ స్టేట్ ఆడిట్ డైరెక్టర్ డి.విజయ భారతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలోని జిల్లా ఆడిట్ కార్యాలయంలో అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న చక్రపాణికి తాత్కాలికంగా పదోన్నతి కల్పించి కార్పొరేషన్‌కు కేటాయించారు. తక్షణమే చక్రపాణిని విధుల్లో చేర్చుకోవాలని స్టేట్ ఆడిట్ డైరెక్టర్ కమిషనర్‌కు లేఖ రాశారు.

## ఉపాధి పనులను వినియోగించుకోండి

**ఓర్వకల్లు, సెప్టెంబరు 4:** జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను వినియోగించుకోవాలని ఎంపీడీవో శివనాగప్రసాద్ కోరారు. బుధవారం ఓర్వకల్లులోని ఉపాధి కార్యాలయంలో ఏపీవో కుమార సాయినాథ్ అధ్యక్షతన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు చూపించాలన్నారు.

## చెత్త సంపద కేంద్రాలకు స్థల పరిశీలన

**కల్లూరు, సెప్టెంబరు 4:** మండలంలోని బొల్లవరం, సల్కాపురం, కే మార్కాపురం గ్రామాల్లో కల్లూరు తహసీల్దారు కె. ఆంజనేయులు, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం పర్యటించి చెత్తసంపద కేంద్రాలకు స్థలాలను పరిశీలించారు. టీడీపీ నాయకులు, సర్పంచులు, మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఈవోఆర్డీ రవికిషోర్ ఉన్నారు.

## కాచి వడబోసిన నీరు తాగాలి

**కోడుమూరు(రూరల్), సెప్టెంబరు 4:** వర్షాలు కురుస్తున్నందున కాచి వడబోసి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న తెలిపారు. బుధవారం కేజీబీవీలో విద్యార్థులకు ఆయన వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో నరసప్ప, సూపర్ వైజర్ కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

## జిల్లా యోగాసన పోటీల విజేత ఆస్పరి కేజీబీవీ

**కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 4:** రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి అండర్ పాఠశాలల యోగా పోటీలు బుధవారం ముగిశాయి. జిల్లా అంతర్ పాఠశాలల యోగా పోటీల్లో విజేతగా ఆస్పరి కేజీబీవీ పాఠశాల జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో కేజీబీవీ కృష్ణగిరి, తృతీయ స్థానంలో పంచలింగాల కేజీబీవీలు నిలిచాయి. ముఖ్యఅతిథిగా హాజరైన బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధి బ్రిజేష్ సింగ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

## ఘనంగా కృష్ణభగవానుడి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

**కల్లూరు, సెప్టెంబరు 4:** నగరంలో ఎన్టీఆర్ బిల్డింగ్స్‌లోని నాగులకట్ట వద్ద కృష్ణుడి ప్రతిమను పల్లకిలో ఉంచి బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక కల్లూరు కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. స్వామివారికి చంద్రపాల నాగేశ్వరరావు, రామకృష్ణ, గంగా హర్షవర్ధన్ పూజలు చేశా రు. కమిటీ సభ్యులు పురుషోత్తం, అనిల్, సుధాకర్, శివ, ఓబులేసు, నాగ సుంకన్న, చైతన్య పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా నాగేశ్వరయ్య



**ఓర్వకల్లు, సెప్టెంబరు 4:** మండలంలోని గుడుంబాయి తండా గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న నాగేశ్వరయ్య ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. నాగేశ్వరయ్య సేవలను గుర్తించి ప్రభుత్వం ఆయన్ను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఎంఈవో ఓంకార్ యాదవ్, ఉపాధ్యాయ సంఘాలు నాగేశ్వరయ్యను అభినందించారు.

## ఆ వంట ఏజెన్సీలను రద్దు చేయాలి

**సి.బెళగల్, సెప్టెంబరు 4:** మెనూ పాటించని వంట ఏజెన్సీలను రద్దు చేయాలని ఎంఈవో జ్యోతి ప్రధ్యానోపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో ఆమె సమావేశమయ్యారు. ఎంఈవో మాట్లాడుతూ సి.బెళగల్‌లోని ఆదర్శ పాఠశాల, కోటారుమిట్ట, ఇనగండ్ల, గుండ్రేవుల, ముడుమాల, పోలకల్లు పాఠశాలలో వంట ఏజెన్సీలు మెనూ పాటించడం లేదని విద్యార్థుల తలి దండ్రులు, స్కూల్ కమిటీ చైర్మన్లు తమ దృష్టికి తెచ్చారన్నారు. హెచ్‌ఎంలు కిశోర్, తిమ్మన్న, నాగన్న, రేవుల శ్రీను, మునిస్వామి, సీఆర్పీలు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4:** జిల్లాలోని తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని జాతీయ లంబాడీ సంఘం యోగేష్ నాయక్ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి షెడ్యూల్ తెగలకు చెందిన కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చిన కౌతాళం తహసీ ల్దార్ మల్లికార్జున స్వామి, ఆర్ఐ, వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మరుగుదొడ్లను నిర్మించండి

**కల్లూరు, సెప్టెంబరు 4:** కల్లూరు అర్బన్ 28వ వార్డులోని పందిపాడులో మరుగుదొడ్లు నిర్మించాలని మహిళలు కోరారు. బుధవారం టీడీపీ నాయకుడు శేఖర్‌చౌదరిని మహిళలు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా శేఖర్‌చౌదరి మాట్లాడుతూ సమస్యను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత దృష్టికి తీసుకెళ్లి మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయ నాగరాజు, కురువ శేఖర్ పాల్గొన్నారు.

# వరద బాధితులకు మందులు



మందుల వాహనంతో డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 4:** విజయవాడ వరద బాధితులకు కర్నూలు జిల్లా డ్రగ్స్ డీలర్స్ అసోసియేషన్ సేకరించిన మందులను వాహనంలో విజయవాడకు పంపించింది. బుధవారం డిస్ట్రిక్ట్ డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాడికి పుల్లయ్య ఆధ్వర్యంలో నగరంలోని కెమిస్ట్ భవన్‌లో మందుల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడలో చాలా మంది వరద బాధితులు విషజ్వరాలతో బాధపడుతున్నారన్నారు. వీరి కోసం కర్నూలు, ఆదోని, నంద్యాల పత్తికొండ, డోన్, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాల నుంచి సేకరించిన మందులతోపాటు 2280 కిట్లను విజయవాడకు పంపించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎం.శ్రీధర్, ట్రెజరర్ జి.విజయకుమార్ పాల్గొన్నారు.

### వరద బాధితులకు అండగా ఉద్యోగులు

**కర్నూలు(కలెక్టరేట్):** వరద బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు ముందుకు వచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య, ఇన్‌చార్జి డీఆర్వో చిరం జీవిని వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ వరద బాధితుల కోసం ఒకరోజు మూలవేతనం ఇవ్వడానికి ప్రభుత్వ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ చైర్మన్, జిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గిరికుమార్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రుడు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంగన్న, ఏపీ ఎన్జీవోస్ నగర అధ్యక్షుడు కాశన్న తదితరులు పాల్గొన్నారు

### విరాళాల సేకరణ

**కోడుమూరు:** విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు భాగ్యరత్న ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విజయవాడలో వరదల కారణంగా వేలాది ఇల్లు నీటిలో చిక్కుకపోయాయని, ఎంతోమంది తిండిలేక ఆర్థాకలితో అలమ టిస్తున్నారని అన్నారు. వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో విరాళాలు సేకరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజయ్ భాస్కర్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## నాణ్యత పాటించకుంటే చర్యలు

**మంత్రాలయం, సెప్టెంబరు 4:** మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించకుంటే తప్పవని ఎంపీడీవో మణిమంజరి, ఎంఈవో షైనుద్దీన్, రాగన్న హెచ్చరించారు. బుధవారం నిర్వాహకులతో ఎంపీడీవో మాట్లాడుతూ మెనూ పాటించాలని, భోజనం శుభ్రంగా వేడిగా అందించాలని అన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్లు, సీఆర్పీలు నరసన్నగౌడు, బంగారప్ప, భీమేష్, హెచ్ఎం అంపయ్య, నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

**కౌతాళం:** మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ సుబ్బరాజు అన్నారు. ఎమ్మార్సీ భవనం బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంఈవో-1 అంజనేయులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## ధరలను నియంత్రించాలి

**దేవనకొండ, సెప్టెంబరు 4:** నిత్యావసరాల ధరలను నియంత్రించాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ కార్యదర్శి సర్సారావ్ మాట్లాడుతూ పెరిగిన ధరలతో పేదలు కొని, తినే పరిస్థితి లేదన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. కండప్ప, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి

**ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 4:** ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు ఆరోగ్యప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలిపారు. డ్రైవర్ బాషా ఆరు నెలల క్రితం ఫిట్ అయినా బకాయిలు చెల్లించలేదన్నారు. ఇన్‌చార్జి గోపాల్ స్పందించకపోవటంతో మానసిక ఒత్తిడితో డ్రైవర్ మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. బసవరాజు, హరిబాబు, షరీఫ్, ఖాతాల్ సాహెబ్, ఎజాజ్, సతీష్ పాల్గొన్నారు.

## పీఠాధిపతికి మహా పుష్పాభిషేకం



పుష్పాభిషేకం చేస్తున్న పండితులు

**మంత్రాలయం, సెప్టెంబరు 4:** మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులకు బుధవారం రాత్రి మహాపుష్పాభిషేకం నిర్వహించారు. భక్తులు పుష్పవర్షం కురిపించారు. పీఠాధిపతి మాట్లాడుతూ దేశ ప్రజలంతా ఐక్యంగా శాంతి సమాధానం, రైతులు సస్యశ్యామలంగా ఉండాలని పూజలు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు, పండితులకు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

## బాధ్యతలు చేపట్టిన సబ్ కలెక్టర్ భరద్వాజ్



**ఆదోని, సెప్టెంబరు 4:** సబ్ కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ యూపీఎస్సీ 2022 బ్యాచ్ ముస్సోరీలో శిక్షణ పూర్తిచేసుకుని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్‌గా కడపలో పనిచేశానని అన్నారు. మొదటి పోస్టింగ్‌గా ఆదోని సబ్ కలెక్టర్‌గా నియామకం అందుకోవడం సంతోషకరమన్నారు. సమస్యలను నివారించడానికి కృషి చేస్తానని అన్నారు.

### దెబ్బతిన్న పంటల పరిశీలన

**కౌతాళం:** భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను, రోడ్లను బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. ఉప్పరహాల్ గ్రామం వద్ద దెబ్బతిన్న కల్వర్టును పరిశీలించారు. తాము మండల కేంద్రానికి నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నట్లు, విద్యార్థులు కూడా ఇదే దారిలో వెళతారని, బాగుచేయాలని గ్రామస్థులు కోరారు. మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటానని గ్రామస్థులకు ఆయన హామీ ఇచ్చారు. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను సర్వే చేసి నివేదికలను సిద్ధం చేయాలని తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ని ఆదేశించారు. వీఆర్వో పాపమ్మ, ఏవో శేషాద్రి, నాయకులు ఏకాంబిరెడ్డి, ఈరన్న, నాగేంద్రప్ప, రంగస్వామి, గాదిలింగ, కురువ సురేష్ ఉన్నారు.



# నాణ్యమైన భోజనం అందాలి

- ●పదో తరగతిలో ప్రతి విద్యార్థికి 60శాతం మార్కులు రావాలి: కలెక్టర్
- ●జొన్నగిరి ఎస్సీ హాస్టల్ తనిఖీ





సాంబారు రుచి చూస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, విద్యార్థులతో మాట్లాడుతూ...

**తుగ్గలి, సెప్టెంబరు 4:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం మండలంలోని జొన్నగిరి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వంట, సరుకులను పరిశీలించి, రుచి చూశారు. విద్యార్థులతో హాస్టల్లో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సీబీఎస్ఈ సిలబస్ అర్థం అవుతుందా అని అడిగారు. పదో తరగతిలో ప్రతి విద్యార్థి 60 శాతం కంటే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. హాస్టల్‌లో గదులు పెచ్చులూడి శిథిలావస్థలో ఉన్నాయని, మరమ్మతులు చేయించాలని అన్నారు. జిల్లాలోని 37 సంక్షేమ హాస్టళ్ల స్థితిపై నివేదిక ఇవ్వాలని సంక్షేమ హాస్టల్ జేడీ రంగలక్ష్మిని ఆదేశించారు. ఎంపీపీ ఎర్రనాగప్ప, ఎంఈవో రమావెంకటేశ్ గౌడు, సర్పంచ్ ఓబులేసు, వార్డెన్ రమేష్, విద్యాకమిటి చైర్మన్ రవి యాదవ్, బాలన్న, లక్ష్మణ స్వామి, రాంపురం మల్లయ్య, డీలర్ సుంకన్న తదితరులు ఉన్నారు.

### రూ.20 లక్షలతో హాస్టల్ అభివృద్ధి

జియో మైసూరు కంపెనీ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో హాస్టల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆ కంపెనీ పీఆర్‌వో రామ్మోహన్ సోమిరెడ్డి కలెక్టర్‌కు తెలిపారు. మంచాలు, బెడ్స్‌తో పాటు దుప్పట్లు అందజేశామని, గదుల నిర్మాణం, డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామన్నారు. కలెక్టర్ వారిని అభినందించారు.

## రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 4:** తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని జాతీయ లంబాడీ సంఘం యోగేష్ నాయక్ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. షెడ్యూల్ కులాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి షెడ్యూల్ తెగలకు చెందిన కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చిన కౌతాళం తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఆర్ఐ, వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలని కోరారు. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్‌డే

**ఆదోని టౌన్, సెప్టెంబరు 4:** లయన్స్ క్లబ్, ఆవోపా సంస్థ ఆధ్వర్యంలో సాయిభారతి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థులు అభివృద్ధిలోకి వస్తారని క్లబ్ జిల్లా చైర్మన్ గోపినాథ్ అన్నారు. వ్యాస రచన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. క్లబ్ చైర్మన్ ప్రసాద్ రావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, వన్నప్ప రాజు, ఆవోపా సభ్యులు వెంకటేశ్వరులు, రఘు, మమత శ్రీ, అనూష, పాఠశాల కరెస్పాండంట్ దుర్గేష్ వాల్మీకి పాల్గొన్నారు.

# గిరిజన గ్రామంలో విద్యా కుసుమాలు



విద్యార్థులతో ఉపాధ్యాయురాలు కళ్యాణి



- నాడు ముగ్గురే విద్యార్థులు, నేడు 43 మంది
- పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయురాలి కృషి
- నేడు టీచర్స్ డే..

**పత్తికొండ, సెప్టెంబరు 4:** పట్టణానికి 5 కి.మీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామం జీవరాళ్లమల తండా గ్రామంలో ఎంపీపీ పాఠశాల ఉంది. ఇక్కడ విద్యార్థులు కేవలం ముగ్గురే ఉండటంతో మూసివేసే దశలో ఉండగా ఓ ఉపాధ్యాయురాలు కళ్యాణి కృషితో నేడు 43 మంది విద్యార్థుల స్థాయికి చేరింది. కళ్యాణి 2017 నుంచి ఇక్కడే ఎస్జీటీగా పనిచేస్తున్నారు. బీఎస్సీ, బీఈడీ చదువుకుని 2008లో ఎస్జీటీగా ఎంపికకాగా, 2010లో హొళగుంద మండలానికి నియమితులయ్యారు. అనంతరం 2017లో గిరిజనతండా జీవరాళ్లమల తండాకు బదిలీపై వచ్చి విద్యాభివృద్ధికి కృషిచేశారు. గురుకుల, నవోదయ, సైనిక్ స్కూలు ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వగా గురుకులానికి 23మంది, నవోదయ ఒక విద్యార్థి ఎంపికయ్యారు. కళ్యాణి కృషిని గుర్తించిన ప్రభుత్వం కర్నూలులో 2022 ఆగస్టు 15న, అదే ఏడాది టీచర్స్‌డేలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది. అలాగే విజయవాడలో స్త్రీశక్తి ప్రతిభ పురస్కార్, జ్యోతిరావు పూలే అవార్డులతో సత్కరించాయి.

**విద్యతోనే భవిష్యత్తు**

మాది మారుమూల గ్రామం. నాన్న ప్రభుత్వోద్యోగి. మూతపడే స్థితిలో ఉన్న పాఠశాలను చూసి బాధ కలిగింది. గిరిజన గ్రామంలో విద్యార్థులకు చదువు నేర్పాలన్న సంకల్పంతో పనిచేశా. నా భర్త రమేష్ సహకరించారు. విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుంది.

- కళ్యాణి, ఉపాధ్యాయురాలు

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



మంజులమ్మ ఆలూరు | శ్రీనివాస్ మొలగవల్లి | నరసింహులు అరికెర | అక్తర్ ఉన్నిస్సా హెబ్బటం | ఎన్ రాజాసతీష్ ఆదోని | సరోదే వెంకోబా విరుపాపురం | వెంకటసుబ్బయ్య దొడ్డనగేరి | నరసింహారెడ్డి ఆర్జినగర్ | బసమ్మ హాలహర్వి | సుధాశేఖర్ సిద్ధాపురం | సిద్ధలింగ జేహోసల్లి | వెంకటరమణ దైవందిన్నె

**ఆలూరు, సెప్టెంబరు 4:** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను బుధవారం డీఈవో శ్యామ్యూల్ విడుదల చేశారు. ఆలూరు మండలం మొలగవల్లి ఎంపీపీపీ పాఠశాలలో హెచ్ఎం టీ శ్రీనివాసులు, ఆలూరు మెయిన్ స్కూల్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న మంజుల, అరికెర డా బీఆర్ అంబేద్కర్ గురుకులం పీజీటీ తెలుగు అధ్యాపకుడు సీ నరసింహులు ఎంపికయ్యారు..

**హొళగుంద:** హెబ్బటం జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశ్రాస్త ఉపాధ్యాయులు అక్తర్ ఉన్నిస్సా ఎన్నిక య్యారు. హెచ్ఎం రంగన్న అభినందనలు తెలిపారు.

**ఆదోని (అగ్రికల్చర్):** పట్టణంలో మున్సిపల్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు, రాజాసతీష్, విరుపాపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సరోదే వెంకోబా, దొడ్డనకేరి జడ్పీ పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు వై వెంకటసుబ్బయ్య, ఆర్జీ నగర్ జడ్పీ పాఠశాల బయోలా జికల్ సైన్స్ ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి ఎంపికయ్యారు.

**హాలహర్వి, సెప్టెంబరు 4:** సిద్ధాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన సుధాశేఖర్, జే హోసల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన సిద్ధలింగ, హాలహర్వి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బసమ్మ ఎంపికయ్యారు. వీరిని ఎంఈవో ఈరన్న అభినందించారు.

**ఆస్పరి:** ములుగుందం ప్రాథమిక(బీసీ) ఉపాధ్యా యుడు ఎల్లప్ప, జడ్పీ పాఠశాలనుంచి మారంబి ఎంపిక య్యారు. ఎంఈవో రాజేంద్రప్రసాద్ అభినందించారు.

**ఎమ్మిగనూరు రూరల్:** దైవందిన్నె ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు జి.వెంకటరమణ ఎంపికయ్యారు.

# వైసీపీ నిర్లక్ష్యంతోనే రహదారులపై గుంతలు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

**ఆదోని టౌన్, సెప్టెంబరు 4:** గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రహదారులపై గుంతలు ఏర్పడ్డాయని ఎమ్మెల్యే పార్థసారథి బుధవారం అన్నారు. మాధవరం రోడ్డు గుంతలకు తాత్కాలిక మరమ్మతులను పరిశీలించారు. నిధులు మంజూరు కాగానే నూతన రహదారులు నిర్మిస్తామని అన్నారు. విజయవాడలో వరద బాధితుల కష్టాలు తీర్చడం కోసం చంద్రబాబు రాత్రింబవళ్ళు పనిచేయడం ఆయన పరిపాలనకు నిదర్శనమని అన్నారు. వరద బాధితుల సేవల కోసం సిబ్బంది, పోలీసులను పంపామన్నారు మునిసిపల్ అసిస్టెంట్ కమీషనర్ అనుపను, ఏఈ రాజశేఖర్ రెడ్డి బీజేపీ నాయకులు ఉపేంద్ర మల్లిక పాల్గొన్నారు.

# సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించిన జగన్

- వైసీపీ పాలనలో దళితులకు రక్షణ కరువు : మాజీ మంత్రి మారెప్ప



మాట్లాడుతున్న మారెప్ప

**పత్తికొండ టౌన్, సెప్టెంబరు 4:** ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఎస్సీ కార్పొరేషన్ నిదులును అప్పటి సీఎం జగన్ పక్కదారి పట్టించారని మాజీ మంత్రి మారెప్ప ఆరోపించారు. బుధవా రం పత్తికొండకు వచ్చిన ఆయన టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు సందోలి ముత్యాల తిరుపాలు స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ఉద్ధరిస్తారనీ పాలనను కట్టబెడితే.. ఐదేళ్లలో ప్రజలకు నరకయాతన చూపారన్నారు. వైసీపీ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎన్టీఆర్ మాదిగలను రాజకీయంగా ప్రోత్సహించారనీ గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు పరిపాలన సవ్యంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్గీకరణ అమలైతే ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్‌లో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు తిరుపాలు, సుధాకర్, మహిళ సంఘం నాయకురాలు శాంతి పాల్గొన్నారు.

## వాహనాల దొంగ అరెస్ట్



బైకులు, నిందితుడితో డీఎస్పీ, పోలీసులు

**మంత్రాలయం, సెప్టెంబరు 4:** సి.బెళగల్ మండలం పోలకల్లు గ్రామానికి చెందిన బైకుల దొంగ ఉప్పరి వీరేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎమ్మిగనూరు ఇన్‌చార్జి. డీఎస్పీ శ్రీనివాసాచార్ తెలిపారు. బుధవారం సాయంత్రం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఉప్పరి వీరేష్ దేవనకొండ మండలం తెర్నెకల్ గ్రామనికి చెందిన రాజుతో కలిసి మద్యంకు, జల్సాకు బానిగా మారి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పార్క్‌చేసి ఉన్న బైకులను, ఆటోను దొంగతనం చేసి అమ్ముకునే వారన్నారు. బాధితుల పిర్యాదు మేరకు ుమంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ రాఘవేంద్ర, దశరథరాముడులు చాకచక్యంగా నిందితున్ని అరెస్టు చేశారని తెలిపారు. నిందుతులు దొంగలించిన బైకులను మంత్రాలయం, ఎమ్మిగనూరు టౌన్, కోసిగి, కర్నూలు, కళ్యాణదుర్గం పరిదిలోని ఐదు మోటారు సైకిళ్లను, ఒక ఆటోను స్వాదీనం చేసుకున్నామని అన్నారు. ఎమ్మినూరు కోర్టులో హాజ.రు పరిచినట్లు తెలిపారు. రాజు అనే నిందితుడు తప్పించుకున్నాడని త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

## ప్రశాంతంగా చేసుకోవాలి : సీఐ

**గోనెగండ్ల, సెప్టెంబరు 4:** వినాయక చవితిని ప్రశాంతంగా చేసుకోవాలని సీఐ గంగాధర్ కోరారు. బుధవారం మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడితే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎమ్మెల్యే దృష్టికి రహదారి దుస్థితి



రహదారిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

**నందవరం, సెప్టెంబరు 4:** మండలంలో దెబ్బతిన్న రహదారుల దుస్థితిని టీడీపీ నాయకులు గురురాజారావు దేశాయిఎమ్మెల్యే బీవీ దృష్టకి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారని అన్నారు. గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్నగౌడు, ఎంబి చర్చి పెద్ద శివ, గోపాల్, రాజు, అజయ్, సలీం పాల్గొన్నారు.

## కూలిన మట్టి మిద్దె

**ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 4:** మండలంలోని గుడికల్లు గ్రామంలో బుధవారం తెల్లవారు జామున బాధితుడు శాంతిరాజు, గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు దూలాలు తడవడంతో మిద్దె కూలింది. అయితే ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. రూ.2.50 లక్షలు నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

## పంట నష్ట పరిహారం అందించాలి



పొలాల్లో నిరసన తెలుపుతున్న నాయకులు

**నందవరం, సెప్టెంబరు 4:** వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ నాయకులు మహేంద్ర బాబు, హనుమప్ప డిమాండ్ చేశారు. బుధవారం మాచాపురం, కనకవీడు, పూలచింత, ముగతి గ్రామాల్లో పంటలను పరిశీలించారు.

## చిరుతపులి దాడిలో గొర్రెలు మృతి



గొర్రెలను పరిశీలిస్తూ..

**పెద్దకడుబూరు, సెప్టెంబరు 4:** మండల పరిధిలోని గవిగట్టు గ్రామంలో చిరుతపులి దాడిలో బుధవారం ఆరు గొర్రెలు మృతి చెందాయి. యజమాని బంగారయ్య మాట్లాడుతూ పాఠశాల వెనుక భాగంలోని కొంవద్ద గొర్రెలు మందను ఆపామని తెల్లవారుజామున చిరుతపులి దాడి చేసిందన్నారు. మృతి చెందిన గొర్రెలను అటవీ అధికారులు పరిశీలించారు.

## దళితులపై దాడులను ఉపేక్షించొద్దు

**ఆలూరు, సెప్టెంబరు 4:** దళితులపై దాడులు చేసే వారిని ఊపేక్షించొద్దని ఎమ్మార్పీఎస్ నాయకులు చిప్పగిరి లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్యను సన్మానించారు.

# మరమ్మతులకు చర్యలు



గోనెగండ్ల సర్కిల్ రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 4:** వర్షంతో దెబ్బతిన్న ప్రధాన రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ప్రధాన రహదారులైన శివ సర్కిల్, బస్టాండ్ రోడ్డు, బైపాసురోడ్డు, గోనెగండ్ల సర్కిల్ ప్రాంతాలను ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షానికి రహదారులు గుంతలు పడి పాడైపోయాయన్నారు. మరమ్మతులను రెండు, మూడు రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు, కొత్త రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడం వల్లే నేడు ఈ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎల్లెల్సీ కాలువను పరిశీలించి, నిమజ్జనానికి ఏర్పాట్లు చేయలని అధికారులకు సూచించారు. ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు, సూపర్‌వైజర్ ప్రభు, కౌన్సిలర్ రాందాసుగౌడు, అమాన్, టీడీపీ నాయకులు తురేగల్ నజీర్, దేవదాసు, వడ్డె కృష్ణ, సోమన్న, సోములగూడూరు బాషా, కామార్తి మహేష్ పాల్గొన్నారు.

## గోడౌన్ పూర్తి చేసేందుకు చర్యలు

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 4:** వ్యవసాయ మార్కెట్ కమిటీలో గోడౌన్ నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీని పరిశీలించారు. నిర్మాణం కొంతమేర పూర్తయ్యిందని, మిగతా నిర్మాణం పూర్తి చేసేందుకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందు కు రాలేదని తెలిపారు. సెక్రటరీ పద్మావతి, సిబ్బంది ఉన్నారు.

## పొలం తగాదా కేసులో రిమాండ్

**నందవరం, సెప్టెంబరు 4:** మండలంలోని జోహరాపురం గ్రామ పొలం తగాదాలో ఇరువర్గాలను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాల మేరకు 45 రోజుల క్రితం ఇరు వర్గాల ఘర్షణ పడ్డారు. ఈ విషయంలో ఇరు వర్గాలకు చెందిన 23 మంది వ్యక్తులను బుధవారం రాత్రి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు

# ఉత్సవాలకు మూడు రోజులే అనుమతి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

**పత్తికొండ, సెప్టెంబరు 4:** పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు మూడురోజులకే అనుమతి ఉందని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. బుధవారం డీఎస్పీ వెంకట్రామయ్యతో కలిసి పత్తికొండ వినాయక ఉత్సవకమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవా లకు ఐదురోజులకు ఇవ్వాలని కోరగా, ఉన్నతాధికారులు మూడురోజులకే ఇచ్చారని తెలిపారు. ప్రతి మండపానికి వాట్సప్‌లో అనుమతి తీసుకోవాలని, సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలన్నారు. 9వ తేది నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌సమస్య తలెత్తకుండా నిర్వాహకులు తమకు కేటాయించిన సమయంలోనే విగ్రహాలను తరలించాలని కోరారు. రూరల్ సీఐ పులిశేఖర్, బీజేపీ ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌నాయుడు, కాంగ్రెస్ ఇన్‌చార్జి. క్రాంతినాయుడు, సభ్యులు ఉన్నారు.

**అల్లర్లకు పాల్పడవద్దు : డీఎస్పీ**

**మంత్రాలయం:** వినాయక చవితి వేడుకల్లో అల్లర్లకు పాల్పడవద్దని ఎమ్మిగనూరు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసచార్ సూచించారు. బుధవారం సాయంత్రం మంత్రాలయం సర్కిల్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల ఏర్పాటుపై సీఐ రామయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ పరమేష్ నాయక్, కృష్ణయ్య, రాఘవేంద్ర, దశరథరాముడు, గోవిందు, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

**కౌతాళం:** వినాయక చవితిని కలిసిమెలిసి నిర్వహించుకోవాలని కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపారు. కౌతాళం పోలీస్ స్టేషన్‌లో బుధవారం మండలంలోని మత పెద్దలు, గ్రామస్థులతో శాంతి కమిటీ సమావేశంను నిర్వహించారు. ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్, మండల వివిధ పార్టీ నాయకులు ఉలిగయ్య, మల్లయ్య, దాట్ల సుబ్బరాజు, ఇశాక్ సాబ్, సౌద్రి బసవరాజు, రామలింగ, మారెప్ప, బసవరాజు ఉన్నారు.